# ది పూర్ క్రీచర్

—వార వేణుగోపాలస్వామి

బయట చాల కోలాహలంగా ఉంది. మధ్య మధ్యన మా శ్రీమతి గొంతుకూడా వినబడు తోంది ఏమిటా అని వరండాలోకి వచ్చి చూశాను వ్రాస్తున్న ప్రేమకథ ఒకటి మధ్యలో వదిలేసి.

జనం అంతా గుడిసెముందు పోగయ్యారు. మేం ఉంటున్న బిల్డింగ్‌కు ఎదురుగా ఉంది ఆ గుడిసె. మా పక్కపోర్షన్స్‌లో ఉంటున్న పిన్ని గార్లు అంతా అక్కడే ఉన్నారు. వీళ్ళంతా అక్కడ ఎందుకు గుమిగూడారో అర్థం కా లేదు నాకు. అసలు ఏం జరిగిందో తెలుసుకుం దామని అక్కడే నిల్చుని ఉండిపోయాను.

"ఇదిగో చూడూ. నా నైలెక్సు చీర గాలికి ఎగిరిపడింది. పైన ఆరబెట్టుకున్న చీర అలా పడింది. ఇలా మాయమయింది. ఇంతలో ఎవరువస్తారు. నువ్వుగానితీశావా?" ఆ గుడిసె లో ఉంటున్న మల్లమ్మే ఆ చీరను తీసిఉండాలి అన్న అనుమానం కొద్దీ సౌమ్యంగా అడిగింది శాంత. మల్లమ్మ అయోమయంగా చూసింది తనకు ఆ చీరసంగతి అసలు తెలీదు అన్నట్లు.

"పోనీ ఎవ్వరైనా తీసుకుపోతుంటే చూ శావా" లాజికల్‌గా అడిగింది మా శ్రీమతి.

"నువ్వు చెప్పావని చెప్పంతే" పక్కపో ర్షన్‌లో ఉంటున్న కుమారి ధైర్యంచెప్పింది.

మల్లమ్మకు మతిపోయినట్లు అయింది. కళ్ళలో భయందిగులు కూడుకొన్నాయి. ఏమీ మాట్లాడలేక పోతోంది.

"బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడవేం" అంటూ కళ్ళు ఎఱ్ఱచేసి ది శాంత.

"అసలు ఆచీరను చూడనేలేదు అమ్మగారు బిడ్డమీద వొట్టు అమ్మగారూ" తను నిర్దోషి అన్నట్టు బ్రతిమాలు కొంది మల్లమ్మ

"ఈ దరిద్రముండలు ఆలా చెప్పరుశాంత, మీవారు వచ్చాక పోలీసుల్ని తీసుకువచ్చి అడి గించండి, అప్పుడు బయటపడుతుంది చీర" కింది పోర్షనులో ఉంటున్న వరలక్ష్మి సలహా యిచ్చింది.

"అవును పోనీలేఅని వదిలేయడానికి జేబు రుమాలా ఏమన్నానా పోలీసులచేత అడిగిం చాల్సిందే" వరలక్ష్మి సలహాను బలపర్చింది శాంత.

ప్లాను ప్రకారం పోలీసు వచ్చాడు ఓ రెండు గంటల తరువాత. మళ్ళీ వీధిలో జనం గుమి గూడారు. వీధివెంబడి పోతూ ఉన్న వాళ్ళు కూడా ఆగి ఏమిటా అని చూస్తున్నారు.

"ఎవ్వరూ యింట్లో" అరిచాడు పోలీసు.

మల్లమ్మ భయపడుతూ వాకిట్లోకివచ్చింది.

"మల్లమ్మ అంటె నువ్వేనా"

"అవునండి బాబు"

"ఇక్కడ ఏమిచేస్తూ ఉంటావ్" పెద్దకుట్ర కేసులో అనుమానితుణ్ణి ఇంటరాగేట్ చేసి నట్లు అడిగాడు పోలీసు.

"పాతపేపర్లు కొనుక్కొని పోతూ ఉంటా

అయ్యగారూ"

"అదిసరే పైన ఆరేసిన చీర గాలికి కింద పడితే ఎత్తుకు పోయావట"

"నేను తీయలేదండి అయ్యా" వణుకుతూ చెప్పింది మల్లమ్మ.

"పాత పాటే పాడుతొందర్రా"పిన్నిగార్లు విసుగు వ్యక్తపరిచారు.

"ఏం మర్యాదగా చెప్పదల్చుకో లేదా" చెప్పక పోతే ఏంచేస్తానో చూడు అన్నట్టు గద్దించాడు పోలీసు.

మల్లమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి అప్పటికే.

"నువ్వెందుకు చెప్పుతావే" అంటూ లాటీ కర్రతో రెండు వేసాడు.

"దణ్ణం పెడతాను అయ్యా. నన్ను ఒదిలేయండి చీర నేను తీయలేదు అయ్యా" బోరున ఏడుస్తూ పోలీసు కాళ్ళమీద పడింది మల్లమ్మ.

మల్లమ్మని విడిపించుకొని పోలీసు గుడిసె అంతా సోదాచేసాడుచీరకోసం. కాని ఫలితం లేక పోయింది. ఉత్త చేతుల్లో తిరిగివస్తూ "ఎక్కడికో దాటించేసింది సార్. మీరు స్టేషన్‌కు వచ్చి ఇనస్పెక్టర్ గారికి రిపోర్టు ఇవ్వండి. కటకటాలలో ఉంచితేగాని నిజం చెప్పదు గాడిద" శాంత భర్తకు సలహా యిచ్చాడు పోలీసు. వచ్చినపని పూర్తి అయి పోయినా కెలవు తీసుకోవడాన్కి తటపాయి స్తున్నాడు పోలీసు. అదికనిపెట్టి పోలీసుచేతిలో రెండు రూపాయల కాయితం (కొత్తది) పెట్టాడు శాంత భర్త.

ఇంతేనా అన్నట్టు చూసాడు పోలీసు చీర దొరికి ఉంటె అలాటి మాటే అన్న భావం వ్యక్త పరిచాడు శాంత భర్త,

'వస్తానరే' అంటూ పోలీసు వెళ్ళిపోయాడు వీధిలో సందడి అయిపోయింది, పొద్దుగుంకి ది వీధి లైట్లు వెలిగాయి.

చిత్ర మేమిటంటే ఒక గంట తర్వాత తెలిసి ది పోయిందన్న చీర ఉందని-కింద పోర్షన్ లో ఉంటున్న వాళ్ళు ఎక్కడికో పోతూ పడి ఉన్న చీరని లోపలవేసి పోయారని తిరిగి వచ్చాక యిచ్చారని. కాని ఆ విషయం మల్లమ్మకు తెలియదు. ఎప్పటికీ తెలియదు

ఎందుకో క్షమాపణకు కాదు గదా ఓదార్పుకు కూడా మల్లమ్మ నోచుకోలేదు. అయినా ఆతుకుల బొంత చుట్టబెట్టుకున్న మల్లమ్మకు పైనెలెక్కులో ఉన్న నాగరికత క్షమాపణ చెప్పడమా? అందుకే నాగరికత దృష్టిలో మల్లమ్మ మనిషికాదు. ఒక ప్రాణి మాత్రమే దానికి హృదయం ఉండదు. ఉన్నా గాయ పడదు గాయపడినా బాధ ఉండదు.

నాకు అనిపిస్తుంది, మల్లమ్మ ఒక అందుకు అదృష్ట వంతురాలు అని. నడి వీధిలో బట్టలు విప్పించి ఊరేగించలేదు చెట్టుకు కట్టిపెట్టి కిరసనాయిలు పోసి నిప్పు ముట్టించలేదు వాళ్ళు.